కేరాఫ్ పోస్ట్ మాస్టర్

మానస

"మీరు రూమ్ లేదంటే ఈ వర్షపు రాత్రి ఎక్కడికి వెళ్ళగలను...! ప్లీజ్! ఎంతైనా ఫరవాలేదు. ఎలాంటి రూమైనా ఫరవా లేదు. ఎడ్జెస్టు చెయ్యండి." దీనంగా అడుగుతున్నాడు మెడికల్ రిప్రజెంటేటివ్ ముకుందరావు.

"సారీ, సార్! ఉంటే ఇవ్వమా? వాన తగ్గేదాకా కావాలంటే ఆ కుర్చీలో కూర్చోండి. అంతకు మించి మరేం చెయ్యలేను" తలవంచుకునే అన్నాడు హోటల్ గుమాస్తా ఏదో రాసుకుంటూ.

ఫస్ట్‌ఫ్లోర్ లోంచి ఈ భాగవతమంతా

చూస్తున్న సుబ్బారావు క్రిందికి దిగివచ్చి 'రండి సార్! నా రూమ్‌లో ఉందురు గాని-రేపేదైనా ఖాళీ అయ్యేదాకా!' అంటూ ముకుందరావుని తన గదికి ఆహ్వానించాడు. మొహమాట పడుతూనే థాంక్యూ వెరీమచ్ సార్! అంటూ సుబ్బారావుని అనుసరించాడు ముకుందరావు.

సరిగ్గా అయిదేళ్ళ క్రితం వైజాగ్‌లో అదీ మెడికల్ రిప్రజెంటేటివ్‌లుముకుందరావు సుబ్బారావుల కలయకకి నాంది!

రాను రాను ఎన్నో చోట్ల కల్సుకుంటూనే వచ్చారు. నెలకి ఇరవై అయిదు రోజులు టూర్‌చేసి, మిగిలిన ఐదారు రోజులు హెడ్‌క్వార్టర్స్ విజయవాడలో సేదతీర్చుకుంటూ ఉంటారు వాళ్ళు!

ఐదేళ్ళ క్రితం...పరిచయం అవక ముందు ఎవరికెవరో...? బట్. ఆ తరువాత మాత్రం...ఒకళ్ళకొకళ్లైపోయారు వాళ్ళు!

* * *

సుబ్బారావు చాలా కలుపుగోరు మనిషి. మంచితనం, పరోపకారం అతని జన్మతోసహా వచ్చేశాయి. ఇవన్నీగాక అతడో జాలి మనిషి! తనకేకాదు, ఎదుటివాడికయినా చిన్న కష్టంవస్తేచాలు, తల్లడిల్లిపోతాడు. ప్రక్కవాడు ఆకలితో పడుకుంటే అతనికి భోజనం సహించదు. ఆకలితో దహించుకుపోయే వాడికొక్కడికి అన్నం పెడితే...పదిమంది అతనికి పెడతారు. ఇది సుబ్బారావు నమ్మిన సిద్ధాంతం! లేనివాడికి తగినంత సహాయం చెయ్యడమే అతని ధ్యేయం.

అందుకే,

వచ్చే ఐదారు వందల జీతం...ప్లస్ బేటాడం డబ్బుల్లో మిగిలిందేగాక, మరో వందో ... రెండొందలో అప్పుచేస్తూ ఉంటాడు ప్రతినెలా!

ముకుందరావు కూడా ఇంచుమించు సుబ్బారావులాంటివాడే! అయితే ఎటొచ్చీ అప్పుజేసి మాత్రం పరోపకారం చెయ్యడు.

'చెయ్యడు' అంటే చెయ్యలేడు అని అనుకోవాలి! అతని కెనకాల పది మంది కూర్చుని తినేవాళ్ళున్నారు. వాళ్ల డొక్కలు మాడ్చి...మరొకళ్ళ కడుపులు నింపలేడు.

అదీ, అతని పరిస్థితి...!

* * *

సుబ్బారావూ, ముకుందరావూ హెడ్‌క్వార్టర్స్ విజయవాడ నుంచి...సాధారణంగా ఒకే రోజున బయల్దేరుతారు.

సుబ్బారావు మెయిల్ రూట్‌లో వైజాగ్‌దాకా వచ్చి, అక్కడ్నుంచి రాయపూర్‌దాకా, ముకుందరావు సర్కార్ ఎక్స్‌ప్రెస్ రూట్‌లో కాకినాడదాకా ప్రయాణంచేసి, అక్కడ్నుంచి మెయిల్ లయినులో వైజాగ్ మీదుగా ఖరంపురందాకా—వెళ్తారు.

చిన్నసైజు కంపెనీల్లో ఉద్యోగా

లేమో.. పాపం వాళ్ళు అంతలేసి ప్రయాణాలు చెయ్యక తప్పదు మరి!

తిరుగు ప్రయాణంలో ఇద్దరూ మళ్ళీ వైజాగ్‌లో కల్సుకుంటారు. అక్కడే ఐదారురోజులు గడపడానికి వాళ్ళకి అవకాశం దొరికేది. అలా వైజాగ్ వచ్చీ రాగానే వాళ్లు యెప్పుడూ బసచేసే లాడ్జింగులో ఇండెక్స్ బోర్డుమీద పడిపోతుంది. వాళ్ళ దృష్టి.

సుబ్బారావు వచ్చాడా? అని ముకుందరావు, ముకుందరావు వచ్చాడా? అని సుబ్బారావు—ఆత్రుతగా చూస్తుంటారు.

* * *

ఈ సారి మామూలుగానే బరంపురం వైపు క్యాంపుకెళ్ళిన ముకుందరావు పని ముగియగానే ... వైజాగ్ వచ్చేశాడు. వచ్చి రావడంతోటే పోస్టాఫీసుకి వెళ్లి ఉత్తరాలు చూసుకునేసరికి......అతని గుండె ఆగిపోయినంత పనయింది...!

"వ్యాపార విషయాలలో నువ్వు శ్రద్ధ తీసుకుంటాను" అని మాటఇచ్చినానిలుపుకోలేకపోయావు. ఫలితంగా కంపెనీ ప్రొడక్ట్సుకి మార్కెట్ పడిపోయింది. పైపెచ్చు నీ ప్రవర్తన సరిగా లేదని మాకు అనేక డీలర్సు దగ్గర్నుంచి కంప్లెయింట్సు కూడా వచ్చాయి.

కాబట్టినిన్ను ఈఉత్తరంఅందినరోజు నుంచి...పనిలోంచి తొలగించడమైనది. దాని ప్రకారం,..

ఆ రోజునుంచీ నీకు జీతం గానీ బేటాలుగానీ ఇవ్వడం జరగదు. వీలైనంత త్వరలో డివిజనల్ ఆఫీసుకి వచ్చి నీ దగ్గర మిగిలిపోయిన శాంపిల్సూ, హ్యాండ్‌బ్యాగూ వగైరాలు మాకు అందజేసి..., నీ అకౌంట్స్ సెటిల్ చేసుకోవాల్సింది...!...

డివిజనల్ మేనేజర్

ముకుందరావుకి బుర్ర పనిచెయ్యడం మానేసింది . బాస్ ఉత్తరం చదువుకునేసరికి. నిశ్చేష్టుడై అలాగే వుండిపోయాడు కాసేపు.

"అయ్యగారూ! దసరా మామూలిప్పించరూ—!" అంటూ వినయంగా చేతులు కట్టుకుని నిల్చున్న పోస్టాఫీసు బంట్రోతు చేతిలో ఓ రూపాయిపెట్టి, గట్టిగా నిట్టూరుస్తూ, వడి వడిగా నడిచాడు ముకుందరావు లాడ్జికి!

* * *

"అనవసరంగావర్రీ అవక ముకుందం ...! ఇది కాకపోతే మరొకటి నేనిప్పిస్తాను నీకు ఉద్యోగం! సరేనా?" వెన్ను తట్టాడు సుబ్బారావు ఆ మర్నాడు రాయపూర్ నుంచి వచ్చీ రాగానే సంగతి తెల్సుకుని.

"అదంత ఈజీ కాదు సుబ్బారావ్! మరోచోటికి ఉద్యోగంకోసం వెళ్ళితే ఎవడయినా అడుగుతాడుఉన్న ఉద్యోగం నేనెందుకు మానేశాననీ, లేకపోతే ఎందుకు పీకేశారనీ,...! ఖర్మ నా

రోజులిలా ఉన్నాయి. వెళ్ళిపోతాను ఇంటికివాళే! ఉద్యోగం లేనివాడికి ఈ లాడ్జింగు ఖర్చులు కూడా ఎందుకు...? శుద్ధ దండుగ!" నిట్టూర్చాడు ముకుంద రావు.

"ఊరికే డీలా అయిపోకు ముకుందం ...! ఉద్యోగం అంటే జ్ఞాపకం వచ్చింది. మా కంపెనీలోనే ఓ జూనియర్ రిప్రజెంటేటివ్ పోస్టు ఖాళీగా ఉంది. మొన్న కాన్ఫరెన్సుకి వెళ్లినప్పుడు మా బాస్ చెప్పాడు కూడా చాకులాంటి కుర్రోడ్నెవర్నైనా చూడవయ్యా! అని, నేను రికమండు చేస్తాను. బాస్ హైద్రాబాదులోనే ఉన్నాడింకా. నీ అప్లికేషను అక్కడికి పంపించేస్తే... అవసరమైతే ఇంటర్వ్యూ పంటిదక్కడేచేసేసి బొంబాయి వెళ్లగానే ఆర్డర్సు పంపించేస్తాడు. అంతా పది పదిహేను రోజుల్లో నువ్వు మళ్లీ సర్వీసులో జాయినవ్వొచ్చు ...!" ముకుందరావు భుజంతట్టి మరీ చెప్పాడు సుబ్బారావు.

"ఏమో సుబ్బారావ్! నా కంతా అయోమయంగా ఉంది. గంపెడు సంసారాన్నెలా ఈదుకురావాలో తెలియటం లేదు. గాడిదకొడుకులు నెత్తిమీద పెట్టుకున్నంతకాలం పెట్టుకున్నారు నాలాంటి. వాడు కంపెనీకి 'వజ్రం' అని అందలం ఎక్కించారు. ప్చ్! ఏం లాభం సుబ్బారావ్.. ? కాని ఒకటి నా మీద ఎవడో గిట్టక రాసుంటాడు, గాని...కాకపోతే మార్కెట్ పడిపోవడ మేంటి ... ? ఏమంటావు...?" ముకుందరావు తన్ను తాను ఓదార్చుకునే స్థితికి వచ్చేశాడు.

"అవన్నీ ఇప్పుడెందుకు ముకుందం! మనం జరగబోయేది ఆలోచించాలి. నువ్వు వెంటనే అప్లయిచేసేసెయ్. ఇదిగో బాస్ అడ్రసు. వస్తాను. నాకింకా అనకాపల్లి ఏరియాలో పనుండిపోయింది. మళ్లీ ఎల్లుండి కల్సుకుందాం...!" అంటూ సుబ్బారావు వెళ్లిపోయాడు.

ఉద్యోగం వస్తున్న ఆశ లేక పోయినా, సుబ్బారావు మాట తీసెయ్య లేక అప్లయిచేశాడు ముకుందరావు, "కేరాఫ్ పోస్టుమాస్టర్...విశాఖపట్నం అనే అడ్రసిచ్చి.

రెండురోజులు ఓపిక పట్టిన తరువాత పోస్టాఫీసులోనే మకాం వేశాడు, జవాబు కోసం.

నాలుగోనాడు రిప్లయి వచ్చింది, ముకుందరావుకి.

"మీ అప్లికేషను అందింది. అర్హతలూ, అనుభవం ఉన్న మీలాంటి యువకులకు మా కంపెనీ యెప్పుడూ స్వాగతం చెపుతూనే ఉంటుంది. మూడు వందల జీతం ప్లస్ రోజువారి బేటాలేకాక హ్యాండ్సమ్ బోనసుకూడా ముడుతుంది మీకు...!

నేను బొంబాయి వెళ్లి మీకు అపాయింట్‌మెంట్ ఆర్డరూ, టూర్ ప్రోగ్రాం, కఒనెల అడ్వాన్సు పంపిస్తాను. హైదా్రి



ఊఁ కానివ్వండు! ఎవరు గెలుస్తారో చూద్దాం!! గెలిచిన వాళ్ళనే యీ పూటకి అన్నం!!!

బాద్‌లో ఓ నెల్లాళ్ల ట్రైనింగు తరువాత మీరు లైనుమీదికి వెళ్లవచ్చు—!

మా రిప్రజెంటేటివ్ సుబ్బారావుమీకు అన్నివిధాలా సహకరిస్తాడు....

డివిజనల్ మేనేజర్"

ఎగిరి గంతేశాడు ముకుందరావు ఉత్తరం చూడంగానే! సుబ్బారావు మిత్రుడు కాదు. నిజంగా తనపాలిటి దేవుడు అతనికి ఈ సంగతి చెబితె ఎంత సంబరపడతాడో—? సమయానికి లేడు. విజయనగరం పనుందని వెళ్లాడు... రాగానే చెప్పాలి" ముకుందరావు ఆనందం పట్టలేకుండా వున్నాడు.

* * *

"కంగ్రాట్స్ మైడియర్ ముకుందం! నే చెప్పాగా, మా బాస్ చాలా మంచి వాడని. గుడ్‌లక్ మై బోయ్! ఇదిగో బ్యాగు...!"

"వ్వాట్—? నీ బ్యాగిస్తున్నావేమిటి గురూ, జోక్‌చేస్తున్నావా...?"

"జోక్‌కాదు ఆర్డర్సు...! పైనించి ఆర్డర్సిలాగే వచ్చాయి ముకుందం...! కావాలంటే చూడు. సుబ్బారావు జేబులోంచి ఉత్తరం తీసి ముకుందరావు చేతిలో పెట్టాడు.

"డియర్ మిష్టర్ సుబ్బారావ్!

మేము మీకెన్ని సదుపాయాలు సమకూర్చినా, దానికి విశ్వాసం చూపించకపోవడమే కాకుండా మమ్మల్నే మోసగించాలని చూస్తున్నారు మీరు. వైజాగ్ నుంచి మీ స్నేహితుడు ముకుందరావు పంపిన అప్లికేషన్‌లో నేను ఇవాళ కలుసుకున్న మీ రిప్రజెంటేటివ్ సుబ్బారావు ద్వారా మీ కంపెనీలో ఒక వేకెన్సీ ఉందని తెలిసింది, అంటూ వ్రాశాడు.

అంటే అతను మిమ్మల్ని కల్సు

కున్నది పద్ధాలుగా తారిఖన్న మాట.. ; ఆ రోజున మీరు మీ స్వదస్తూరీతో వ్రాసిన "డైలీ రిపోర్టు" ప్రూపు ప్రకారం ఇంకా రామ్‌పూర్‌లో ఉన్నట్టే!

దీన్నిబట్టే మా కర్థమౌతోంది, రామ్‌పూర్ సైడ్‌బిజినెస్ దెబ్బతినడానికి కారణం... !

కంపెనీ రూల్స్ ప్రకారం, 'బిజినెస్' నెగ్లెక్ట్ చేసేవాళ్ళకిచ్చే డిసిప్లెనరీ యాక్షన్ క్రింద మిమ్మల్ని ఈ ఉత్తరం అందిన క్షణంనుంచీ పనిలోనించి తొలగించడమైనది.

మీ బ్యాగూ, శాంపిల్సు, లిటరేచరూ వగైరాలు, మేము కొత్తగా అపాయింట్ చేసిన మిష్టర్ ముకుందరావుకి అప్పజెప్పవలసింది...! మీ అకౌంట్స్ త్వరలో సెటిల్‌చేసి, మీకు రావలసింది మీ యింటికే పంపుతాము,

ఎప్పుడూ మీ శ్రేయస్సును కోరే...
డివిజనల్ మేనేజర్''

ఉత్తరం చదివి, దాదాపు కళ్ళలో నీళ్ళు పెట్టుకున్న ముకుందరావు "నీ నోట్లో మట్టి కొట్టలేను నేను. నేను చెయ్యలేను బాబూ ఈ ఉద్యోగం...! ఉద్యోగం పోతే పొయ్యింది గానీ... నీకు అన్యాయం జరుగుతుంటే మాత్రం చూడలేను. ప్లీజ్! తారీఖు పొరపాటున వ్రాసాను అని వ్రాసేస్తాను మీ బాస్‌కి." అంటూ గొడవ చెయ్యడం మొదలెట్టాడు

"ముకుందం.. ! నీ పిచ్చిగానీ, నువ్వెన్ని అరచినా వాళ్ళు నీకివ్వబోయే ఉద్యోగం ఆపగలరుగానీ ... నాకు మాత్రం మళ్ళీ ఇవ్వరు. మరో దార్లో పోయే దానయ్యని ఓ వంద తక్కువకి బేరం ఆడుకుని కుదుర్చుకుంటారు. అప్పుడిద్దరం కూడా నోట్లో వేలేసుకుని కూర్చోవాలి...!"

"అందుకని ..?"

"అందుకనే ముకుందం... నువ్వైనా ఈ ఉద్యోగం నిలబెట్టుకో! పెళ్ళాం పిల్లలూ గలవాడివి, మరో ఊత దొరికేదాకా, నేను నీ ఆసరాలో ఉంటాను, సరేనా...?"

"సుబ్బారావ్! ఇలా జరుగుతుందని కల్లోకూడా అనుకోలేదు. నన్ను క్షమించవూ...!" గొల్లుమన్నాడు ముకుందరావు.

"ఛ ! తప్పు ఊరుకో! యూ ఆర్ ఇన్నోసెంట్" వెన్ను తట్టాడు సుబ్బారావు.

* * *

"మీ రిచ్చిన సూటూ బూటూ వేసుకుని కనపడిన ప్రతివాడినీ ముఖస్తుతి చేస్తూ...బజార్లవెంట బ్యాగు పుచ్చుకుని ఎండకూ, వానకూ తిరిగిన నన్ను... బిజినెస్ ఇంప్రూవ్ చేశావంటూ ఎడిషన్ ఇంక్రిమెంట్లిచ్చారు. బోనసులిచ్చారు. షేక్‌హ్యాండ్లిచ్చారు సర్టిఫికెట్లిచ్చారు, పనికిరాని మందుల్నికూడా అంద

మైన సీసాల్లో పోసి, మరింత అందమైన అట్టపెట్టెల్లో పెట్టి...ఇవి మందులుకావు అమృతం అని అనిపించారు నాచేత

ఊళ్లో జబ్బులున్నా, లేకపోయినా, డాక్టర్లని చేతిలో బొమ్మలుగా ఉపయోగించుకునే కీల కాన్ని 'ట్రైనింగ్' అన్న పేరుతో మాకు నూరిపోసి, మా చేత ఎందరో నిర్భాగ్యుల్ని మోసగింపజేశారు.

అలాంటి తప్పుడు పన్లు చేసినప్పుడల్లా...సెహబాష్ అన్నారు...!

కాని,

కాఫీ నీళ్ళైనా దొరకనిచోట, నిద్రాహారాలు మాని (అసలు వాటి సంగతి మరచిపోయి...) నాలుగు రోజుల్లో చెయ్యాల్సిన పని నేను రెండురోజుల్లోనే పూర్తిచేసుకుని ... ఒకింత విశ్రాంతి తీసుకుంటే మాత్రం...డిసిప్లనరీ యాక్షన్ తీసుకోవాలనుకున్నారు.

ఇదేనా మీరు మా పట్ల చూపాల్సిన ఆదరణ...? ఇదేనా మీరు చూపాల్సిన కృతజ్ఞత...? పాత న్యూస్‌పేపర్‌లా తీసి పారేశారు అవసరం తీరగానే! మీకు దయ లేదా,? జాలి లేదా? సానుభూతి లేదా? అంటూ ఏవేవో వ్రాయాలనుకున్నాడు. సుబ్బారావు వాళ్ళ బాస్‌కి.

కాని ఎందుకో ఆ పని చెయ్యలేదు- ఇవన్నీ మర్చిపోయి, కళ్లుమూసుకుని హాయిగా నిద్రపోయాడు...!

* * *

ప్రొమోషన్ లెవల్‌దాకా వచ్చిన సుబ్బారావుని ఎలాగైనా పడగొట్టాలి!

కాని, ఎలా? ఎలా?

అని ఎదురుచూస్తూ—ఆ ప్రమోషని తన 'చుట్టానికే' ఇవ్వాలి అని నిర్ణయించుకుని, సుబ్బారావుని అడ్డు లేకుండా చేసుకోడానికే, తిరిగి సుబ్బారావంత యోగ్యుడ్ని—అతని ద్వారానే సంపాదించడానికే—నిరంతరం ప్లాను వేసుకుని కూర్చున్న అతని బాస్‌కి అదృష్టంగా ఇన్నాళ్ళకి ఛాన్సు దొరికిందని అందుకనే ఇంతచిన్న విషయాన్ని కూడా కావాలని రాద్ధాంతంచేసి—అతని ఉద్యోగం పీకించాడని —పాపం సుబ్బారావుకి తెలియదు—

ముకుందరావుకి తెలిసింది!

అదీ,

మూడేళ్ళ తరువాత;

అతనూ, ఇంచుమించు అలాంటి పరిస్థితుల్లో ఇరుక్కున్నప్పుడే!